SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565


సంపుటి: 1 | సంచిక: 74 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శనివారం 19 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |




## కల్పవృక్ష వాహనంపై శ్రీమలయప్ప!

03

- బ్రహ్మోత్సవాల్లో 4 వ రోజు వైభవం..
- గోవుల గోపన్న అలంకారంలో దర్శనం
- శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు
- స్వామివారిని దర్శించుకున్న వేలాది భక్తులు
- పాల్గొన్న జీయర్ స్వాములు, బోర్డు సభ్యులు





## గజేంద్ర మోక్ష అలంకారంలో..

సర్వభూపాల వాహనంపై ఊరేగింపు

8 దిక్పాలకుల భావనకు ప్రతీకగా ఈ సేవ 03



మొదట ఓటు చోరీ..

## ఇప్పుడు పార్టీ చోరీ!

ఎన్నికల సంఘంపై రాహుల్ తీవ్ర విమర్శలు

తృణమూల్ పేరు, గుర్తు ఫ్రీజ్‌పై ఆగ్రహం

.. వివరాలు 4లో





## నేను స్వతంత్రుడిని

ఏఐ మోడల్ దుందుడుకు!

ఆరు అనూహ్య ఘటనలను బయటపెట్టిన ఓపెన్‌ఏఐ

సూచనలను దాటేసేలా సొంత ఆదేశాలు రాసుకున్న పరిశోధనా మోడల్

.. వివరాలు 4లో




## ఢిల్లీలో దారుణం

16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం, హత్య..

నలుగురు నిందితుల్లో ముగ్గురు మైనర్లు

.. వివరాలు 4లో





విజయవాడ, గుంటూరులతో మాస్ రవాణా వ్యవస్థ

## మెగా సిటీగా అమరావతి

### 661 కోట్లతో అసెంబ్లీపై వ్యూపాయింట్ టవర్

- రాజధానిలో 50 శాతం గ్రీన్ కవర్ ఏర్పాటు
- దేశవిదేశాల్లో రాజధాని ఘనతపై విస్తృత ప్రచారం
- 66 వ సీఆర్డీఏ సమావేశంలో సీఎం నిర్ణయాలు

**అమరావతి (సమయం న్యూస్):** అమరావతి రాజధాని పరిధిలో ప్రజా రవాణా కోసం 1 మాస్ ట్రాన్స్ పోర్టేషన్ ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. విజయవాడ, గుంటూరు సహా సమీప ప్రాంతాలను అనుసంధానిస్తూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థను రూపొందించాలన్నారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన 66 వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. రాజధానిలో నిర్మించే నూతన అసెంబ్లీ భవనంపై 250 మీటర్ల ఎత్తైన స్పియర్ టవర్, లిఫ్టుల నిర్మాణానికి 661 కోట్లు

వివరాలు 2లో..

## లాజిస్టిక్స్ హబ్‌గా ఏపీ!

2

21వ ఎస్ఐపీబీలో సీఎం నిర్ణయాలు



02

## దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్

సీఎం సమక్షంలో ఎండీఎల్‌తో ఒప్పందం

5 ఏళ్లలో 15000 కోట్ల పెట్టుబడులు

రెడ్ల పౌరుషం కాపాడేలా

## విధానాలు

- ఈ ప్రభుత్వంలో రెడ్డి కార్పొరేషన్ ఎందుకు లేదు?
- దసరా తర్వాత కొత్త పార్టీ.. సీమ అభివృద్ధి కోసమే!
- యువత రాకపోతే 2 కుటుంబాలదే ఆధిపత్యం
- మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి



3

## భయపడే ప్రసక్తే లేదు!



- ఈడీ విచారణకు సిద్ధమన్న అంబటి రాంబాబు
- నోటీసులపై వైద్యులు, న్యాయవాదులతో చర్చిస్తా
- అనుచరుడిని వేధించి తన పేరు చెప్పించారని ఆరోపణ



డిమాండ్లపై సర్కారు

## సానుకూలం

ఏపీజేఏసీ, ఏపీజీఏ సంఘాల నేతలతో మంత్రి ముఖాముఖి 03

ఉద్యోగుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని హామీ

## అసెంబ్లీ స్పైర్‌కు 661 కోట్లు

- మంత్రి నారాయణ



02



## 100 శాతం గెలుపే లక్ష్యం!

గుంటూరులో టీడీపీ నేతలకు లోకేష్ దిశానిర్దేశం

స్థానిక సంస్థల ఎన్నికలపై సుదీర్ఘ చర్చలు 02

## జనవరిలో నంది నాటకోత్సవాలు

మంత్రి కందుల దుర్గేష్ 02



సమయం



# పేదలకు పూర్తి హక్కులు!

**నేడు ఇళ్ల పట్టాలు ఇవ్వనున్న సీఎం**

**2014 నుంచి 2019 మధ్య చేపట్టిన యత్నాలకు మోక్షం**

**విశాఖలో 28445 కుటుంబాలకు భరోసా**

**స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొననున్న బాబు**

**విశాఖపట్నం (సమయం న్యూస్):** 40 ఏళ్లుగా ఇళ్లపై హక్కుల కోసం ఎదురుచూస్తున్న వేలాది కుటుంబాల కల నెరవేరనుంది. విశాఖపట్నం వేదికగా శనివారం 1 చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న 28445 కుటుంబాలకు సీఎం చంద్రబాబు నాయుడు పట్టాలు పంపిణీ చేయనున్నారు. పూర్తి హక్కులతో సొంతిల్లు ఉండాలన్న కలను సాకారం చేసేందుకు విశాఖ వస్తున్నట్లు సీఎం 1 పోస్ట్ చేశారు. ఈ స్థలాల విలువ సుమారు 8874 కోట్లు ఉంటుంది. మొత్తం 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరిస్తూ 1933853 చదరపు గజాల స్థలంపై హక్కులు కల్పిస్తున్నారు. విశాఖలో ఇంత పెద్ద ఎత్తున క్రమబద్ధీకరణ చేపట్టడం ఇదే తొలిసారి. దశాబ్దాలుగా ఇల్లు ఉన్నా హక్కు లేకపోవడంతో ఆస్తిని బదలాయించుకోలేని సమస్యలకు కూటమి ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెట్టింది. 2014 నుంచి 2019 మధ్య కాలంలో అప్పటి ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి యత్నించినా, 2024 లో మళ్లీ అధికారంలోకి వచ్చాక దీనిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. అభ్యంతరాలు లేని స్థలాలను క్రమబద్ధీకరించాలని అధికారులను సీఎం ఆదేశించారు. శనివారం ఉదయం 10.30 గంటలకు విశాఖ చేరుకోనున్న ముఖ్యమంత్రి, ముందుగా ఆర్కే బీచ్‌లో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకారులతో ఇంటరాక్ట్ అవుతారు. అనంతరం ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో జరిగే బహిరంగ సభలో పాల్గొని లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తారు. ఆ తర్వాత అక్కడి నుంచి తిరిగి పయనం అవుతారు.

# అసెంబ్లీ స్పైర్‌కు 661 కోట్లు!

**250 మీటర్ల ఐకానిక్ టవర్‌కు పరిపాలనామోదం**

**2 వ విడత రైతులకు కౌలు 40000 కు పెంపు**

**29 గ్రామాల్లో మౌలిక వసతులకు 1548 కోట్లు**

**వివరాలు వెల్లడించిన మంత్రి నారాయణ**




**అమరావతి (సమయం న్యూస్):** రాజధాని అమరావతి నడిబొడ్డున అత్యంత ఎత్తైన కట్టడాల్లో 1 గా నిలిచే అసెంబ్లీ (ఐకానిక్ భవనం) 250 మీటర్ల స్పైర్ నిర్మాణానికి టెండర్లు పిలవడానికి 661 కోట్లకు పరిపాలనామోదం తెలిపినట్లు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన 66 వ సీఆర్డీఏ అథారిటీ సమావేశ వివరాలను సచివాలయంలోని ప్రచార విభాగంలో ఆయన మీడియాకు వివరించారు.

### 29 గ్రామాల్లో మౌలిక వసతులు..

రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా 1 వ్యక్తికి 135 లీటర్ల తాగునీరు అందించేందుకు అవసరమైన పైపుల సామర్థ్యం పెంపు, మెయిన్ డ్రైనేజీకి లింక్ డ్రైనేజీ పైపుల ఏర్పాటు, ఎన్ఎస్పీతో (నెగోషియేటెడ్ సెటిల్మెంట్ పాలసీ) కలిపి 1548 కోట్లతో టెండర్లు పిలవడానికి పరిపాలనా అనుమతులు ఇచ్చామని మంత్రి తెలిపారు. ప్రమాణాలు కలిగిన ప్రైవేట్ స్కూళ్ల నిర్మాణానికి రాజధాని ప్రాంతంలో అనుమతులు ఇచ్చామని, అందులో భాగంగానే నలందా విద్యాసంస్థకు కృష్ణాయపాలెంలో 5 ఎకరాలు కేటాయించామన్నారు. ఈ పాఠశాల నిర్మాణం 1.5 ఏళ్లలో పూర్తి కానుందని చెప్పారు. హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కార్యాలయ నిర్మాణానికి నేలపాడులో 50 సెంట్ల భూమి కేటాయించినట్లు పేర్కొన్నారు.

### రైతులకు కౌలు పెంపు..

ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు కౌలు కింద జరీబు భూములకు 50000, నాన్ జరీబు భూములకు 40000 అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో భూ సమీకరణలో భాగంగా భూములు ఇచ్చిన 1 ఎకరం కంటే తక్కువ విస్తీర్ణం కలిగిన రైతులకు గతంలో 30000 ఇచ్చేవారని, 2 వ విడత భూ సమీకరణ సందర్భంగా రైతుల విజ్ఞప్తి మేరకు వారికి కూడా కౌలును 40000 ఇవ్వడానికి సీఆర్డీఏ అథారిటీ ఆమోదం తెలిపిందని చెప్పారు. అక్టోబర్ చివరి నాటికి రెవెన్యూ సమస్యలను పరిష్కరించి ల్యాండ్ పూలింగ్ 80 శాతం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ ధీమా వ్యక్తం చేశారు.


# మెగా సిటీగా అమరావతి

(మొదటి పేజీ తరువాయి..)

కేటాయించేందుకు అథారిటీ ఆమోదించింది. రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో ఎల్పీఎస్ జోన్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి 1548 కోట్లతో టెండర్లు పిలిచేందుకు ఆమోదం తెలిపారు. హోటళ్లు, పాఠశాలలకు భూములు కేటాయిస్తూ మంత్రుల కమిటీ చేసిన సిఫార్సులను ఆమోదించారు. 2 వ దశ పూలింగ్‌లో 1 ఎకరా కన్నా తక్కువ కమతం ఉన్న రైతులకు యాన్యుటీ చెల్లింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అసెంబ్లీ భవనంలో వ్యూపాయింట్ ఏర్పాటు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాజధాని నగరంలో 50 శాతం గ్రీన్ కవర్ ఉండేలా చర్యలు చేపట్టాలని ఏడీసీ అధికారులను ఆదేశించారు.

### సెల్ఫ్ ఫైనాన్సింగ్ సిటీగా అమరావతి..

విద్యుత్ స్తంభాలు లేని, బ్లూ గ్రీన్, డీప్ టెక్, గ్రీన్ ఎనర్జీ లాంటి 5 అంశాలను థీమ్‌గా తీసుకుని అమరావతి పేరును దేశవిదేశాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. రాజధాని నగరాన్ని నడిపేలా భవిష్యత్ రెవెన్యూ మోడల్స్‌పై అధ్యయనానికి 1 కమిటీని నియమించాలన్నారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్లు కలిపి 1 మెగా సిటీగా అమరావతి తయారవుతుందని, ఇది సెల్ఫ్ ఫైనాన్సింగ్ సిటీగా అభివృద్ధి చెందుతుందని సీఎం వెల్లడించారు. సమావేశంలో పురపాలక శాఖ మంత్రి నారాయణ, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.





# దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్!

- సీఎం చంద్రబాబు సమక్షంలో ఎండీఎల్‌తో ఒప్పందం
- 5 ఏళ్లలో 15000 కోట్ల పెట్టుబడులు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 45000 మందికి ఉపాధి
- ఏడాదికి 12 లక్షల టన్నుల నౌకా నిర్మాణ సామర్థ్యం

**అమరావతి (సమయం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ షిప్‌బిల్డింగ్, మెరైన్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా అభివృద్ధి చేసే దిశగా అడుగులు పడ్డాయి. దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటుకు మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) తో రాష్ట్ర ప్రభుత్వం సచివాలయంలో ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో నేషనల్ షిప్‌బిల్డింగ్ అండ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్-ఏపీ, ఎండీఎల్ మధ్య ఈ అవగాహనా ఒప్పందం జరిగింది. దుగరాజపట్నంలో షిప్‌యార్డ్ నిర్మాణం కోసం వచ్చే 5 ఏళ్లలో ఎండీఎల్ సుమారు 15000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో 45000 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. షిప్‌బిల్డింగ్‌తో పాటు అనుబంధ పరిశ్రమలు, మెరైన్ ఇంజినీరింగ్ తదితర రంగాల్లో పెట్టుబడులు రానున్నాయి. ప్రతిపాదిత షిప్‌యార్డ్ ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల నౌకా నిర్మాణ సామర్థ్యంతో రూపుదిద్దుకోనుంది. ట్యాంకర్లు, బల్క్ క్యారియర్లు, కంటైనర్ నౌకలు, ఎల్ఎన్జీ క్యారియర్లను ఇక్కడ నిర్మిస్తారు. దుగరాజపట్నంలో షిప్‌బిల్డింగ్ కమ్ పోర్ట్ క్లస్టర్ అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అంచనాల ప్రకారం షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్ యార్డ్‌కు 29254 కోట్లు, పోర్టు అభివృద్ధికి 9513 కోట్ల వ్యయం అవుతుంది. దుగరాజపట్నం పోర్టును అభివృద్ధి చేసేందుకు కేంద్రం ఇప్పటికే ఆమోదం తెలిపింది. భారత్‌ను 2047 నాటికి అగ్రశ్రేణి షిప్‌బిల్డింగ్ దేశాల్లో 1 గా నిలబెట్టాలన్న జాతీయ లక్ష్యానికి ఈ ప్రాజెక్టు దోహదపడనుంది. ఈ కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎండీఎల్ సీఎండీ జగ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# లాజిస్టిక్స్ హబ్‌గా ఏపీ!

**హార్డ్‌వేర్, ఎలక్ట్రానిక్స్ రంగానికి పెద్దపీట**

**ఎస్ఐపీబీ సమావేశంలో 28 ప్రాజెక్టులకు ఓకే**

**19,739 మందికి కొత్తగా ఉపాధి కల్పన**

**21 వ ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం నిర్ణయాలు**

**అమరావతి (సమయం న్యూస్):** దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను కీలకమైన హార్డ్‌వేర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన 21 వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మొత్తం 28 పారిశ్రామిక ప్రతిపాదనలకు సంబంధించి 22,177.84 కోట్ల పెట్టుబడులకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 19,739 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇంధన, ఐటీ కమ్యూనికేషన్, ఫుడ్ ప్రాసెసింగ్, తయారీ, పర్యాటక రంగాలకు చెందిన ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పెట్టుబడులకు ఆమోదం తెలిపిన తర్వాత 6 నెలల వ్యవధిలోనే పనులు ప్రారంభమయ్యేలా చూడాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని దేశంలోనే ప్రముఖ హార్డ్‌వేర్ తయారీ రాష్ట్రంగా అభివృద్ధి చేయాలని సీఎం పేర్కొన్నారు. సెమీ కండక్టర్లు, చిప్ తయారీ, రోబోటిక్స్ లాంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో భారీ పెట్టుబడులు ఆకర్షించేలా చర్యలు చేపట్టాలన్నారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి లాంటి ఎలక్ట్రానిక్స్ హబ్‌లలో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో హార్డ్‌వేర్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసేందుకు తైవాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు మంత్రి నారా లోకేష్ తెలిపారు.

### లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి..

రాష్ట్రంలోని అన్ని పోర్టుల వద్ద ఉన్న భూమిని వాణిజ్యపరంగా వాడుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం చెప్పారు. పోర్టుల చుట్టూ లాజిస్టిక్స్, షిప్ బిల్డింగ్, గోదాములు, తయారీ పరిశ్రమలు అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రైలు, రోడ్డు, ఎయిర్ కార్గో, అంతర్గత జల రవాణా మార్గాలను అనుసంధానం చేస్తూ ఏపీని లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నారు. శ్రీసిటీ తో తిరుపతి జిల్లా ఎగుమతుల్లో దేశంలోనే 10 వ స్థానంలో నిలిచిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, పి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జనవరిలో నంది నాటకోత్సవాలు!

**అవార్డుల సంఖ్య 3 నుంచి 5 కు పెంపు**

**ఒక్కొక్కరికి 1 లక్ష చొప్పున పారితోషికం**

**మంత్రి కందుల దుర్గేష్**

**అమరావతి (సమయం న్యూస్):** తెలుగు నాటకరంగానికి, సంస్కృతికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నంది నాటకోత్సవాలను పునఃప్రారంభిస్తోందని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. సచివాలయంలోని ప్రచార విభాగంలో చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఎండీ విశ్వనాథన్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. కళలకు నిలయమైన గుంటూరు జిల్లా తెనాలిలో జనవరి నెలలో ఈ నాటకోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. అవార్డుల ఎంట్రీల కోసం 2, 3 రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తామని, అక్టోబర్‌లో ఎంపిక కమిటీని నియమిస్తామని మంత్రి తెలిపారు. డిసెంబర్‌లో ప్రాథమికంగా ఎంపికైన నాటకాల జాబితాను ప్రకటిస్తారు. జనవరి 10 న ప్రతిష్టాత్మక కందుకూరి అవార్డుల ప్రదానంతో ఉత్సవాలు మొదలవుతాయి. అనంతరం 1 వారం పాటు ఎంపికైన నాటకాల ప్రదర్శనలు, ఆ తర్వాత వైభవంగా నంది నాటకోత్సవాల పురస్కార వేడుక జరుగుతుంది. ఇతర రాష్ట్రాల్లోని తెలుగు నాటక సమాజాలకు కూడా తొలిసారిగా అవకాశం కల్పిస్తున్నారు. జాతీయ నాటక పాఠశాల తరహాలో వీడియోల ద్వారా పరిశీలించి నాటకాలను పారదర్శకంగా ఎంపిక చేయనున్నారు.

### పురస్కారాలు.. నంది అవార్డులు..

గతంలో 3 గా ఉన్న కందుకూరి ప్రతిష్టాత్మక పురస్కారాలను 5 కి పెంచి, ఒక్కొక్కరికి 1 లక్ష చొప్పున నగదు అందజేస్తారు. స్థానం నరసింహారావు, ఆచార్య ఆత్రేయ, గరికపాటి రాజారావు, బందారు రామారావు లాంటి దిగ్గజాల పేర్లతో ఈ పురస్కారాలు ఉంటాయి. కొత్తగా ఏర్పాటైన 28 జిల్లాల ప్రాతిపదికన ప్రతి జిల్లా నుంచి 3 గురికి, ప్రత్యేక సేవలు అందించిన మరో 16 మందికి అవార్డులు కేటాయిస్తారు. పద్య నాటకం, సాంఘిక నాటకం, రచయితలు, సాంకేతిక నిపుణుల విభాగాల్లో మొత్తం 100 మందికి కందుకూరి విశిష్ట పురస్కారాలు ఇస్తారు. నాటక పరిషత్తులకు ఒక్కో దానికి 1 లక్ష చొప్పున కేటాయిస్తున్నారు. చిత్ర పరిశ్రమతో పాటు నాటకరంగానికి అవసరమైన అనుమతుల కోసం 1 సింగిల్ విండో విధానాన్ని తెచ్చారు. సినిమా, టీవీ రంగాల నంది అవార్డులకు సంబంధించి ఈ వారంలోనే ప్రకటన విడుదల చేసి, జనవరి నాటికి ప్రదానోత్సవాలు పూర్తి చేస్తామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.



# 100 శాతం గెలుపే లక్ష్యం!

- గుంటూరులో టీడీపీ నేతలకు లోకేష్ దిశానిర్దేశం
- స్థానిక సంస్థల ఎన్నికలపై సుదీర్ఘ చర్చలు
- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు
- ఎమ్మెల్యే రామాంజనేయులు ఇంట్లో భేటీ

**గుంటూరు (సమయం న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం గెలుపే లక్ష్యంగా పనిచేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గుంటూరులోని వినాయక నగర్‌లో శుక్రవారం సాయంత్రం ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు నివాసంలో గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రజాప్రతినిధుల ఆత్మీయ విందు సమావేశం జరిగింది. ఈ భేటీకి మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలతో పాటు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రజాప్రతినిధులతో లోకేష్ విస్తృతంగా చర్చించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. గత ప్రభుత్వ అరాచక విధానాలను ప్రజలకు వివరించి చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. ఈ ఆత్మీయ సమావేశంలో గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, గుంటూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, తెనాలి శ్రావణ్ కుమార్, మహ్మద్ నసీర్, గల్లా మాధవి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఏపీ గవర్నర్

**తిరుమల:** కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ దర్శించుకున్నారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకున్న గవర్నర్ కు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయక మండపంలో వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం చేశారు. టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు దివాకర్ రెడ్డి, పనబాక లక్ష్మి, కోల ఆనంద్, సీవీఎస్వో మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.




# కల్పవృక్ష వాహనంపై శ్రీమలయప్ప!

- బ్రహ్మోత్సవాల్లో 4 వ రోజు వైభవం
- గోవుల గోపన్న అలంకారంలో దర్శనం
- శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు
- స్వామివారిని దర్శించుకున్న వేలాది భక్తులు



**తిరుమల (సమయం న్యూస్):** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో 4 వ రోజు ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు కల్పవృక్ష వాహనంపై గోవుల గోపన్న అలంకారంలో భక్తులను కటాక్షించారు. తిరుమాడ వీధుల్లో అంగరంగ వైభవంగా సాగిన ఈ వాహన సేవలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. క్షీరసాగర మథనంలో ఉద్భవించిన దివ్య సంపదల్లో కల్పవృక్షం 1. కోరిన ఫలాలను ప్రసాదించే కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించిన శ్రీనివాసుడు భక్తులకు సర్వాభీష్టాలను ప్రసాదించే దివ్య రూపంలో దర్శనమిచ్చారు. ఈ వాహన సేవలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# రెడ్ల పౌరుషం కాపాడేలా విధానాలు

- ఈ ప్రభుత్వంలో రెడ్డి కార్పొరేషన్ ఎందుకు లేదు?
- దసరా తర్వాత కొత్త పార్టీ.. సీమ అభివృద్ధి కోసమే!
- యువత రాకపోతే 2 కుటుంబాలదే ఆధిపత్యం
- మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి



**అనంతపురం (సమయం న్యూస్):** వచ్చే దసరా తర్వాత ఏకాదశి రోజున తన కొత్త రాజకీయ పార్టీని ప్రకటిస్తున్నట్లు మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన ప్రకటన చేశారు. అనంతపురం పర్యటనలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన పార్టీ ఎలా ఉండబోతుందో వివరించారు. తమ పార్టీ అభ్యుదయ భావాలతో ఉంటుందని, కుల మతాలకు అతీతంగా అందరికీ ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. అదే సమయంలో కొందరు రెడ్లు తనను అపార్థం చేసుకున్నారని, ఒరిజినల్ రెడ్ల పౌరుషం, ఆత్మగౌరవం కాపాడే విధంగా తమ పార్టీ ఉంటుందన్నారు. ఈ ప్రభుత్వంలో రెడ్డి కార్పొరేషన్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆయన ప్రశ్నించారు.

రాయలసీమను మారుస్తాం..

విభజిత రాష్ట్రంలో 12 ఏళ్లు చంద్రబాబు, జగన్ పాలించారని, రాయలసీమకు వీరు ప్రత్యేకంగా చేసింది ఏంటని నిలదీశారు. ఈ 2 కుటుంబాలు ఉన్నంత కాలం రాయలసీమకు న్యాయం జరగదన్నారు. రాయలసీమకు 100 టీఎంసీలు ఇచ్చే పరిస్థితి లేకుండా చేశారని దుయ్యబట్టారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే రాయలసీమను మారుస్తామని హామీ ఇచ్చారు. దక్షిణ భారతదేశంలో అత్యంత వెనుకబడింది ఏపీనేనని, 11 అంశాల్లో రాష్ట్ర పరిస్థితి దారుణంగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యువత ముందుకు రాకపోతే ఆ 2 కుటుంబాలే ఏలుతాయని వ్యాఖ్యానించారు. విశాఖ, తిరుపతిలో ప్రెస్ మీట్లు నిర్వహించిన తర్వాత తన కొత్త పార్టీని ప్రకటిస్తానని విజయసాయిరెడ్డి వెల్లడించారు.



# భయపడే ప్రసక్తే లేదు!

ఈడీ విచారణకు సిద్ధమన్న అంబటి రాంబాబు

నోటీసులపై వైద్యులు, న్యాయవాదులతో చర్చిస్తా

గుండెకు 2 స్టెంట్లు వేశారని కామెంట్

అనుచరుడిని వేధించి తన పేరు చెప్పించారని ఆరోపణ

**తాడేపల్లి (సమయం న్యూస్):** మద్యం కేసులో తనకు ఈడీ జారీ చేసిన నోటీసు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారా లోకేష్ కొనసాగిస్తున్న రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నోటీసులు, బెదిరింపులు, కేసులకు తాను భయపడబోనని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో నుంచి తొలగిపోయే వరకు తన గొంతు మరింత బలంగా వినిపిస్తూనే ఉంటుందని హెచ్చరించారు.

### మళ్లీ నోటీసు ఇవ్వాలని కోరా..

సెప్టెంబర్ 11 న విచారణకు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నప్పటికీ, తనకు సెప్టెంబర్ 18 న ఆ నోటీసు అందిందని రాంబాబు తెలిపారు. గడువు ముగిసిన తర్వాత నోటీసు అందినందున, కొత్తగా లిఖితపూర్వక నోటీసు జారీ చేయాలని ఈడీని కోరినట్లు వెల్లడించారు. ఇటీవల తనకు గుండె చికిత్స జరిగిందని, 2 స్టెంట్లు వేశారని చెప్పారు. ఒత్తిడికి దూరంగా ఉండాలని వైద్యులు సూచించినందున, విచారణకు ఎప్పుడు హాజరు కావాలనే విషయంపై వైద్యులు, న్యాయ బృందంతో సంప్రదించిన తర్వాత నిర్ణయం తీసుకుంటానన్నారు. దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తానని స్పష్టం చేశారు.

### నా ధైర్యం తగ్గలేదు..

మద్యం వ్యాపారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని రాంబాబు ఖండించారు. తన అనుచరుడు మర్రి సుబ్బారెడ్డిని విచారణ సమయంలో వేధించి, తన పేరు చెప్పేలా చేశారని ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రభావితం చేస్తూ తనను ఇరికించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పటికే తనపై 50 కి పైగా కేసులు నమోదయ్యాయని, 18 రోజులు జైలులో గడిపానని గుర్తుచేశారు. తన గుండెలో 2 స్టెంట్లు వేసి ఉండొచ్చు గానీ, ధైర్యం మాత్రం తగ్గలేదని, ప్రతి కేసును చట్టపరంగా ఎదుర్కొంటానని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.



# ఓఆర్ఆర్ పనుల్లో వేగం

- అమరావతి రింగ్ రోడ్డు, జాతీయ రహదారులపై మంత్రి సమీక్ష
- 190 కిలోమీటర్ల మేర 6 లేన్లతో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు
- వినుకొండ-గుంటూరు 2 లేన్ల రహదారి 4 లేన్లుగా విస్తరణ
- అడ్డంకుల పరిష్కారానికి 1 ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు

**అమరావతి (సమయం న్యూస్):** అమరావతి ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు రాష్ట్రంలోని పలు కీలక జాతీయ రహదారుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో అమరావతి ప్రాజెక్టు అమలు యూనిట్ డైరెక్టర్ విరాజ్ సురాజ్ వాలా మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సాగుతున్న జాతీయ రహదారుల అభివృద్ధి పనుల పురోగతిని ఆయన మంత్రికి వివరించారు.

### ఓఆర్ఆర్ భూసేకరణపై ఆరా..

5 జిల్లాల పరిధిలో 190 కిలోమీటర్ల మేర 6 లేన్లతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ పురోగతిపై డైరెక్టర్‌ను మంత్రి ఆరా తీశారు. ప్రస్తుతం 2 లేన్లుగా ఉన్న వినుకొండ-గుంటూరు జాతీయ రహదారిని 4 లేన్లుగా విస్తరిస్తున్నట్లు అధికారులు మంత్రికి తెలిపారు. గుంటూరు-నిజాంపట్నం హైవే రూట్ అలైన్‌మెంట్‌కు ఆమోదం లభించిందని, త్వరలోనే దీనిని టెక్నికల్ కమిటీ ముందుకు పంపనున్నట్లు వెల్లడించారు.

అమరావతి ఓఆర్ఆర్ నిర్మాణం కోసం అవసరమైన ఫ్లై యాష్‌ను ఉచితంగా సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని మంత్రి గుర్తు చేశారు. క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులకు ఎలాంటి అడ్డంకులు ఉన్నా వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు జాతీయ రహదారుల ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. హైవే పనుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా 1 టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసి పనులను వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి జనార్ధన్ రెడ్డి వెల్లడించారు.

# గజేంద్ర మోక్ష అలంకారంలో..

సర్వభూపాల వాహనంపై ఊరేగింపు

8 దిక్పాలకుల భావనకు ప్రతీకగా ఈ సేవ

భక్తి పారవశ్యంలో మునిగిపోయిన భక్తులు

రాజ్యపాలన సుభిక్షంగా సాగాలని వేడుక

**తిరుమల (సమయం న్యూస్):** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా 4 వ రోజు రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు సర్వభూపాల వాహనంపై గజేంద్ర మోక్ష అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు. మాడ వీధుల్లో అంగరంగ వైభవంగా సాగిన ఈ వాహన సేవలో వివిధ రాష్ట్రాల కళా బృందాలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు గజేంద్ర మోక్ష అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీమలయప్పస్వామి వారిని కనులారా దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. సర్వభూపాల అంటే అందరు రాజులు అని అర్థం. ఇందులో 8 దిక్పాలకులు కూడా ఉంటారు. తూర్పున ఇంద్రుడు, ఆగ్నేయంలో అగ్ని, దక్షిణంలో యముడు, నైరుతిలో నిర్ఋతి, పశ్చిమాన వరుణుడు, వాయువ్యంలో వాయువు, ఉత్తరాన కుబేరుడు, ఈశాన్యంలో పరమేశ్వరుడు విరాజిల్లుతారు. వీరంతా శ్రీమహావిష్ణువును తమ భుజాలపై కొలువుంచి సేవిస్తారనే భావనకు సర్వభూపాల వాహనం ప్రతీకగా నిలుస్తుంది. శ్రీమలయప్పస్వామి వారి అనుగ్రహంతో రాజ్యపాలన సుభిక్షంగా సాగి, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ వాహన సేవ చాటిచెబుతుంది. ఈ వేడుకలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, సీవీఎస్వో కేవీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్లపై సర్కారు సానుకూలం!

వీఆర్వో, వీఆర్ఏ సంఘాల నేతలతో మంత్రి ముఖాముఖి

ఉద్యోగుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని హామీ

సీఎంతో భేటీ తర్వాత 1 స్పష్టమైన నిర్ణయం

ఇప్పటికే ఆందోళన బాటపట్టిన వీఆర్ఏలు



**అమరావతి (సమయం న్యూస్):** వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్ల సమస్యల పరిష్కారం కోసం ఆయా ఉద్యోగ సంఘాల నేతలతో త్వరలో 1 సమావేశం నిర్వహిస్తానని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. శుక్రవారం సచివాలయంలో అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ రవీంద్రరాజు సారథ్యంలో వివిధ సంఘాల నేతలు మంత్రిని కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇచ్చేందుకు ప్రమోషన్ ఛానెల్లో రేషియో పెంచాలని వారు కోరారు. వీఆర్ఏలకు పేస్కేల్ వర్తింపచేయడంతో పాటు గతంలో నిలిపేసిన డీఏలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సర్వేయర్ల పే స్కేలు పెంచాలని, వారికి డైలీ, ట్రావెల్ అలవెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై త్వరలోనే 1 మంత్రివర్గ ఉపసంఘం సమావేశం ఏర్పాటు చేయిస్తానని మంత్రి హామీనిచ్చారు. ఉద్యోగ సంఘాలతో చర్చించిన తర్వాత సీఎం చంద్రబాబు వద్దకు ఈ సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి సత్యప్రసాద్ స్పష్టం చేశారు. అయితే ఇప్పటికే వీఆర్ఏలు ఉద్యమిస్తున్నారని, సర్వేయర్లు తమ డిమాండ్ల సాధన కోసం సహాయ నిరాకరణ చేస్తామని నోటీసులు ఇచ్చారని జేఏసీ నేతలు గుర్తుచేశారు. వీఆర్వోలు కూడా ఉద్యమానికి సిద్ధమవుతున్నారని, వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని రవీంద్రరాజు కోరారు.

# రైతుల ఆదాయం పెంపే లక్ష్యం!

- అన్నదాతలు జీవనదాతలన్న కేంద్ర మంత్రి శివరాజ్
- తెలంగాణకు 2 లక్షల ఇళ్లు మంజూరు



**హైదరాబాద్ (సమయం న్యూస్):** వ్యవసాయం లేకుండా ప్రపంచం నడవదని, రైతు అన్నదాత మాత్రమే కాదు జీవనదాత అని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ వ్యవసాయ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతుల ఆదాయం పెంపు, ఆహార భద్రత, పోషక భద్రత వ్యవసాయ రంగ ప్రధాన లక్ష్యాలన్నారు. దక్షిణాదిలో కొబ్బరి, జీడిపప్పు, కాఫీ, సుగంధ ద్రవ్యాలు, కోకో పంటలకు మంచి అవకాశాలు ఉన్నాయని, కొబ్బరి ఎగుమతులు 1 ఏడాదిలో 62 శాతం పెరిగాయని చెప్పారు. తెలంగాణకు పీఎంఏవై జీ కింద 2 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

## తైవాన్‌లో భారీ సైనిక విన్యాసాలు!

**చైనా ఉద్రిక్తతల నేపథ్యంలో రక్షణ డ్రిల్లులు**

**1 వ సారిగా డ్రోన్లు, క్షిపణుల సంయుక్త ప్రయోగం**




**తైపీ (సమయం న్యూస్):** తైవాన్‌లో చైనా ఉద్రిక్తతల నేపథ్యంలో భారీ సైనిక విన్యాసాలు నిర్వహించారు. ఈ విన్యాసాల్లో 1 వ సారిగా అటాక్ డ్రోన్లు, క్షిపణులను సంయుక్తంగా ఉపయోగించారు. తైవాన్ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవడంలో భాగంగా ఈ డ్రిల్లులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. యాంటీ ఎయిర్, యాంటీ షిప్, యాంటీ ల్యాండింగ్ క్షిపణుల ప్రయోగాలు కూడా చేపట్టారు. ప్రాంతీయ భద్రతా పరిస్థితుల నేపథ్యంలో ఈ విన్యాసాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## నైజీరియాలో చెలరేగిన హింస!

**అక్రమ మైనింగ్ కేసులో 37 మంది కస్టడీ మృతి**

**దర్యాప్తుకు ఆదేశించిన నైజీరియా సర్కారు**



**మిన్నా (సమయం న్యూస్):** నైజీరియాలో అక్రమ మైనింగ్ కేసులో అరెస్టయిన 37 మంది కస్టడీలో మృతి చెందిన ఘటన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ ఘటనకు నిరసనగా నైజర్ రాష్ట్ర రాజధాని మిన్నాలో ప్రజలు ఆందోళన చేపట్టారు. నిరసనలు హింసాత్మకంగా మారడంతో భద్రతా బలగాలు కాల్పులు జరిపినట్లు సమాచారం. ప్రభుత్వ భవనాలపై దాడులకు ప్రయత్నాలు జరిగిన నేపథ్యంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఘటనపై ప్రభుత్వం దర్యాప్తుకు ఆదేశించింది.

## యెమెన్‌లో మళ్లీ ఉద్రిక్తతలు!

**తీవ్రరూపం దాల్చిన స్థానిక ఘర్షణలు**

**దేశంలో నిరాశ్రయులైన 1.12 లక్షల మంది**



**అడెన్ (సమయం న్యూస్):** యెమెన్‌లో మళ్లీ ఘర్షణలు తీవ్రరూపం దాల్చడంతో మానవతా సంక్షోభం మరింత గంభీరంగా మారింది. తాజా హింసాత్మక పరిస్థితుల కారణంగా సుమారు 1.12 లక్షల మంది దేశంలోనే నిరాశ్రయులయ్యారు. వేలాది మంది ప్రాణభయంతో సముద్ర మార్గం ద్వారా జిబౌటి వైపు పారిపోతున్నట్లు ఐక్యరాజ్యసమితి వలస సంస్థ తెలిపింది. ఇప్పటికే యుద్ధంతో దెబ్బతిన్న యెమెన్‌లో తాజా ఉద్రిక్తతలు ప్రజల జీవన పరిస్థితులను మరింత కష్టతరం చేస్తున్నాయి.

## రష్యా, బ్రిటన్ మధ్య దౌత్య ఉద్రిక్తత!

**ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరాపై రష్యా ఫైర్**

**బ్రిటన్ దౌత్య అధికారికి మాస్కో నిరసన**

**మాస్కో (సమయం న్యూస్):** ఉక్రెయిన్‌కు బ్రిటన్ ఆయుధ సహాయం అందిస్తున్న నేపథ్యంలో రష్యా, బ్రిటన్ మధ్య దౌత్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. బ్రిటన్ సైనిక సహాయంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ రష్యా విదేశాంగ శాఖ మాస్కోలోని బ్రిటన్ దౌత్య అధికారిని పిలిపించి నిరసన తెలిపింది. ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరా కొనసాగించడం ద్వారా బ్రిటన్ యుద్ధాన్ని మరింత ప్రోత్సహిస్తోందని రష్యా ఆరోపించింది. అయితే ఉక్రెయిన్‌కు మద్దతు కొనసాగిస్తామని బ్రిటన్ స్పష్టం చేస్తోంది.

## మారుతున్న బంగారం ధరలు!

**ప్రధాన నగరాల్లో రేట్ల హెచ్చుతగ్గులు..గ్లోబల్ మార్కెట్ పరిస్థితుల ప్రభావం**



**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు మార్పులతో కొనసాగుతున్నాయి. చెన్నై, ముంబై, ఢిల్లీ, కోల్‌కతా లాంటి నగరాల్లో 18, 22, 24 క్యారెట్ల బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, గ్లోబల్ మార్కెట్ పరిస్థితులు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి. కొనుగోలు చేసే వారు నగరాల వారీగా తాజా ధరలు తెలుసుకుని నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## భారత్‌పై అమెరికా ఆంక్షల ఒత్తిడి!

**రష్యా చమురు కొనుగోళ్లపై నయా బిల్లు**

**దేశ ప్రజల ఇంధన భద్రతే ప్రాధాన్యమన్న కేంద్రం**

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై అమెరికా ప్రతిపాదించిన కొత్త ఆంక్షల బిల్లు భారత్‌కు దౌత్య, ఆర్థికంగా ఒత్తిడిగా మారింది. రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాలు విధించే అవకాశం ఉండటంతో భారత్ ఎగుమతులు, ఇంధన ధరలపై ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే దేశ ప్రజల ఇంధన భద్రతే తమ ప్రాధాన్యమని కేంద్రం స్పష్టం చేసింది. అంతర్జాతీయ పరిస్థితులను పరిశీలిస్తూ దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటామని తెలిపింది.

## ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ ఆందోళన!

**యశ్వంత్‌పుర నియోజకవర్గంలో తప్పుల తడక**

**1 బూత్‌లో 1016 ఓట్లకు 389 మాత్రమే చెల్లుబాటు**

**బెంగళూరు (సమయం న్యూస్):** కర్ణాటకలోని యశ్వంత్‌పుర నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. 1 బూత్‌లో 1016 మంది ఓటర్లలో కేవలం 389 మంది మాత్రమే చెల్లుబాటు అయ్యే జాబితాలో మిగిలారని ఆరోపించింది. ఓటర్లను తప్పుగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, మరణించిన వారుగా గుర్తించారని పేర్కొంది. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర సమీక్ష జరిపి, అర్హులైన పేర్లు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులను కోరింది.

## పంజాబ్‌లో బీజేపీ భారీ యాత్ర!

**మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారంతో నషా ముక్త్ యాత్ర**

**13 రోజుల పాటు 4000 కిలోమీటర్ల ప్రయాణం**

**చండీగఢ్ (సమయం న్యూస్):** పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్యపై బీజేపీ భారీ ప్రచార యాత్రకు సిద్ధమైంది. నషా ముక్త్ యాత్ర పేరుతో సెప్టెంబర్ 18 నుంచి 13 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈ యాత్ర సుమారు 4000 కిలోమీటర్లు ప్రయాణించి రాష్ట్రంలోని మొత్తం 117 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేయనుంది. పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్యను ప్రజా ఉద్యమంగా తీసుకెళ్లడమే లక్ష్యమని బీజేపీ నాయకులు తెలిపారు.

## 21 రాష్ట్రాలకు భారీ వర్ష సూచన!

**వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు**

**గంటకు 85 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు**



**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** దేశంలోని 21 రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 85 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఉత్తరప్రదేశ్, బిహార్, గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో వర్షాలు ప్రభావం చూపే అవకాశం ఉంది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## పంట దహనంపై కఠిన చర్యలు!

**కొత్త ముసాయిదా నిబంధనలు తెచ్చిన కేంద్రం**

**ఉల్లంఘిస్తే 15 నెలల పాటు రెడ్ ఎంట్రీ నమోదు**



**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** పంట అవశేషాల దహనాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త ముసాయిదా నిబంధనలు తీసుకువచ్చింది. నిబంధనలు ఉల్లంఘించి పంట అవశేషాలు దహనం చేసే రైతుల భూమి రికార్డుల్లో 15 నెలల పాటు రెడ్ ఎంట్రీ నమోదు చేసే ప్రతిపాదన ఇందులో ఉంది. మళ్లీ ఉల్లంఘనలు జరిగితే లేదా పరిహారం చెల్లించకపోతే ఈ గడువును మరో 15 నెలలు పొడిగించే అవకాశం ఉంది. కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ చర్యలు ప్రతిపాదించినట్లు అధికారులు తెలిపారు.

## 51 వేల మందికి నియామక పత్రాలు!

**రేపు 20 వ రోజ్‌గార్ మేళా నిర్వహణ**

**పత్రాలు అందజేయనున్న ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సెప్టెంబర్ 19 న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 20 వ రోజ్‌గార్ మేళాలో 51000 కు పైగా యువతకు నియామక పత్రాలు అందజేయనున్నారు. దేశవ్యాప్తంగా 45 కేంద్రాల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఎంపికైన అభ్యర్థులు పాల్గొంటారు. ఇప్పటివరకు రోజ్‌గార్ మేళాల ద్వారా సుమారు 12.75 లక్షల మంది యువతకు నియామక పత్రాలు అందజేశారు.

## స్పెషల్ క్యాంపెయిన్ 6కు సిద్ధం!

**ఏర్పాట్లు చేస్తున్న మహిళా శిశు అభివృద్ధి శాఖ**

**గతంలో 1,95,620 పరిశుభ్రత కార్యక్రమాలు**



**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ స్పెషల్ క్యాంపెయిన్ 6 అమలుకు సిద్ధమవుతోంది. గత స్పెషల్ క్యాంపెయిన్ 5 లో దేశవ్యాప్తంగా 1,95,620 పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించగా, 26,506 చదరపు అడుగుల కార్యాలయ స్థలం ఖాళీ అయింది. స్క్రాప్, ఈ వేస్ట్ ద్వారా 14.29 లక్షల ఆదాయం లభించింది. అలాగే 10,126 ప్రజా ఫిర్యాదులు, 1,877 అప్పీలు పరిష్కరించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది.

## పీఎం విశ్వకర్మ పథకానికి 3 ఏళ్లు!

**కోల్‌కతాలో కేంద్ర ఎంఎస్‌ఎంఈ ప్రత్యేక కార్యక్రమం**

**దేశవ్యాప్తంగా 30 లక్షల మంది కళాకారుల నమోదు**




**కోల్‌కతా (సమయం న్యూస్):** పీఎం విశ్వకర్మ పథకం 3 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కోల్‌కతాలో కేంద్ర ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 30 లక్షల మంది కళాకారులు నమోదు కాగా, 24.50 లక్షల మందికి నైపుణ్య శిక్షణ, 18.15 లక్షల టూల్‌కిట్లు అందించామని కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ తెలిపారు. ఇప్పటివరకు 6.18 లక్షల మంది లబ్ధిదారులకు 5,297 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. మహిళా పారిశ్రామికవేత్తల సాధికారత వికసిత భారత్‌కు కీలకమని కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే పేర్కొన్నారు

